## కామెడీ కథ

# నలుడు, భీముడు, తర్వాత ఉమేషే

భమిడిపాటి సోమయాజి

ఉమేష్ షష్టిపూర్తవడం ఉద్యోగం నుంచి రిటైర్ అవడం జరిగి రెండు సంవత్సరాలైంది. భార్య రమకి, ఉమేష్‌కి ఒక సంవత్సరమే తేడా.

రిటైరయినప్పట్నుంచీ యింట్లోంచి అసలు బయటికి వెళ్ళకుండా యింట్లోనే గడిపేస్తున్నాడు. ఇంట్లోనే వున్నాం కదా అని భార్యకి ఏ సహాయం చెయ్యడు. పాలు పొంగిపోతూంటే గ్యాస్ స్టౌ కూడా ఆర్పడు. ఏ పిల్లైనా పాలు తాగేస్తూంటే, ఏదో సినిమాయో టీ.వీ ఎపిసోడో చూసినట్లు చూస్తూ ఊరుకుంటాడు గాని, 'ఉష్ ఉష్' అని రెండుసార్లు కాదు కదా 'ఉష్' అని ఒక్కసారి కూడా అనడు.

"అదేమిటండీ అలా శిలా ప్రతిమలా వుండిపోయారు" అని రమ అంటే, "ఏం చెయ్యమంటావ్! ఉష్ అన్న వెంటనే, అది నా కళ్ళు పీకి నా చేతిలోనే పెడితే, శాశ్వతంగా గుడ్డివాడ్నయిపోయి టి.వి.సీరియల్స్‌లో తర్వాత ఏమయిందో తెలియక నిత్యం ఆత్మక్షోభ పడాలి కదా!" అంటాడు.

ఓసారి రమ పిన్ని, ఢిల్లీ నుంచి హైదరాబాద్‌లో ఓ పదిరోజులుండడానికి వచ్చింది. ఓ నాలుగు రోజుల తర్వాత ఉమేష్ వేషాలన్నీ చూసి, తన భర్త మంచితనానికి మనసులోనే పొంగిపోయింది. ఉండబట్టలేక "మీ బాబయ్యగారు వజ్రమే" అంది రమతో.

"ప్రత్యేకంగా మా బాబయ్యగారి సమక్షంలోనే ఆయన్ని పొగుడుతున్నావేమిటి పిన్నీ!" అంది రమ.

"మీరెళ్ళి స్నానం చేసిరండి" అని తన భర్తను బాత్‌రూమ్‌కి పంపేసి "ఎందుకేమిటి! మీ బాబయ్యగారు పొద్దున్నే స్నానం చేసి, ఓ తువ్వాలు తలపాగా చుట్టుకుని యింటి పన్లు మొదలెట్టేస్తారు. మీ ఆయన చూడు! నాలుగు రోజుల నుంచి చూస్తున్నాను, చిన్న పని కూడా చెయ్యకుండా ఓ చోట కూర్చుని గువ్వపిట్టలా గడిపేస్తున్నాడు. వేళప్రకారం తింటున్నాడు. వేళాపాళా లేకుండా శయనిస్తున్నాడు" అంది రమ పిన్ని.

"ఎవరి అదృష్టం వాళ్ళది, ఏం చేస్తాం!" అంది రమ.

"ఏం చెయ్యడమేమిటే! అసలు యిక ఆర్నెల్లకి రిటైరవుతాడనగా ప్రతీ మొగాడ్ని వంట పనిలోకి దింపెయ్యాలి. ఆర్నెల్లు శిక్షణాకాలం అన్నమాట! ఇప్పుడైనా ఏం ఫర్వాలేదు. నేనుండగానే వంటిల్లు అప్పచెప్పెయి."

"అదేం లాభం లేదు పిన్నీ. వంట మాట దేవుడెరుగు కనీసం కాఫీ అయినా పెట్టరు మీ అల్లుడు. అసలు వీళ్ళ వంశస్థుడు, ఒకాయన ఓసారి ఒక ఆవు దూడ వచ్చి వీపు నాకుతూంటే, తన వీపు కాదులే అన్నట్లు కదలకుండా కూర్చున్నాడట. పైగా 'ఒరేయ్ ఎవరైనా వచ్చి యీ దూడని కొట్టండర్రా' అని ఓ గావుకేక వేశాడట. అక్కడే వున్న దూడని ఓ చేత్తో కొడితే పోతుంది కదా!"

"ఈ విషయాలు వింటూంటే నీ పెళ్ళిచూపులప్పుడు జరిగిన విషయాలు గుర్తొస్తున్నాయ్ నాకు. ఈ ఉమేష్‌బాబు, 'పిల్లని చూడరా' అని వాళ్ళ మేనమామ చెపుతూంటే వెంటనే నీకేసి చూడలేదు. అప్పటికే రెండుసార్లు ఆవులిస్తూ, ఒళ్ళు విరుచుకున్నాడు. రాత్రి తెల్లవార్లూ బస్సు ప్రయాణం వలన బద్ధకంగా వున్నాడేమో పెళ్ళయితే అన్ని బద్ధకాలు వదుల్తాయి కదా అనుకున్నాను"

"నువ్వు వెంటనే స్టాండ్, సిట్ అని ఓ నాలుగుసార్లనకపోయావా పిన్నీ! ఎంత బద్ధకస్తుడో అప్పుడే మనకి తెలిసిపోయేది. అయినా ఈయన నాకు రాసిపెట్టి వుంటే ఎవ్వరు తప్పించగలరు. అయినా నేను కొంతవరకూ అదృష్టవంతురాల్నే! బద్ధకం వలన ఈయన్ని ఉద్యోగంలోంచి తీసెయ్యలేదు"

"ఆ! ఉద్యోగం ఎందుకు పోతుందిలే! నీ భర్తను మించిన బడాబద్ధకస్తులుండి వుంటారు అతని ఆఫీస్‌లో అలా తప్పించుకుపోయుంటాడు"

"అలా మా ఆయన్ని బద్ధకం విషయంలో తీసిపారెయ్యకు. రోజూ నిద్ర లేస్తూనే కళ్ళు తెరవరు. మళ్ళీ తెల్లారింది ఇక తప్పదన్నట్లు, అప్పుడే పుట్టిన కుక్కపిల్లలా మెల్లిగా కళ్ళు తెరుస్తారు. అమ్మయ్య కళ్ళు విడాయి అనుకుంటాను నేను. ఆదివారం ఆఫీస్‌కి శెలవుకదా! శనివారం రాత్రి నిద్రపోతే ఎవ్వరూ ఆదివారం నిద్రలేకపోతే యిక ఎకాయెకీ సోమవారమే నిద్ర లేస్తారు. ఉద్యోగభంగం జరగకుండా ఆ దేవుడే రక్షించాడు నా పతి దేవుడ్ని"

"అసలు విషయానికొద్దాం. నువు చకచకా అన్నీ వండి, వడ్డిస్తూంటే అతనేపనీ చెయ్యడు. ఏది అడిగినా యిదిగో, అదిగో, కొంచెం ఆగండి, నాకు కూడా యించుమించు మీ వయస్సుంది కదా, ఓపిక తగ్గింది, పరుగెత్తి పన్లు చెయ్యడానికి నేనేమైనా మెషీన్నా అని దబాయించు. అలా ఏ కాఫీయేనా ఆలస్యం అయితే తలనొప్పి వచ్చి తన కాఫీ తానే తయారుచేసుకుంటాడు. అలా వంటింటి ప్రవేశమయితే తర్వాత వంటింటి కుందేలుగా మారుతాడు. పెన్షన్ చాలటం లేదు, కథలు రాసి సంపాదిస్తానని కథలు రాస్తూన్నట్లు నటించు. ఇలా అన్ని విషయాల్లో తాత్సారం చేస్తే యితను చేస్తాడా పన్లు, యితని తాత చేస్తాడా!" అని సలహా యిచ్చింది రమ పిన్ని.

ఈ ప్రయోగాలు తట్టుకోలేక విలవిల్లాడిపోయాడు, ఉమేష్ నామధేయుడు.

ఓ రోజు వంట చాలా ఆలస్యమయిపోయింది. ఆకలి తట్టుకోలేకపోయాడు ఉమేష్. రమ వెనకాలే తిరిగాడు.

"మూడు కూతలొస్తే అన్నం పెట్టేస్తానంది" రమ.

"పాపం! వెర్రాడు మూడు కూతలు కూసేసాడు. వెధవ కూతలు కుయ్యకండి. మీరెన్ని కూతలు కూసినా ప్రయోజనం లేదు. కుక్కర్ కూయాలి. అప్పుడు కాని మీ కంచంలోకి అన్నం రాదు" అంది రమ.

ఓ మంచిరోజు చూసుకుని, ఈ ఆకలి బాధలు పడలేక, ఓ తలపాగా చుట్టుకుని వంటలో దిగిపోయాడు ఉమేష్. ఎవరైనా చూస్తారేమోనని, వీధి తలుపు వేసేశాడు.

ఫ్రెండ్ ఎవరో వస్తే యింట్లో లేడని చెప్పి పంపించేసింది రమ.

"సాధారణంగా ఈ బడుద్ధాయి బయటికి పోడే ఎక్కడికి వెళ్ళి వుంటాడబ్బా" అనుకుంటూ పోయాడు ఉమేష్ మిత్రుడు.

రమ పిన్ని ఢిల్లీ వెళ్ళిపోయింది. భార్యని దండించి దార్లో పెట్టి అన్ని పన్లూ చేయిద్దామని చూశాడు

ఉమేష్. పన్లోపని తన మిత్రుడి సలహా తీసుకున్నాడు.

"ఇదేం పెద్ద సమస్య కాదు. అన్ని ఐటెమ్స్‌లో ఉప్పు ఎక్కువ వేసి వంట తగలపెట్టమన్నాడు" మిత్రుడు.

"అన్నంలో కూడా ఉప్పెక్కువెయ్యాలా?"

"అన్నంలో ఉప్పేమిట్రా, ఉమేష్ నాన్నా!" అని విసుక్కున్నాడు మిత్రుడు.

"ఏరా! ఉప్పుసత్యాగ్రహం పని చేసేదా!" అని అడిగాడు మిత్రుడు.

"ఆ! బాగా పనిచేసింది!" అంటూ గరిటె సత్యాగ్రహంలో తిన్న దెబ్బలు చూపించాడు ఉమేష్.

కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ తన మిత్రుని సలహా మేరకు రలాయించడం మొదలెట్టాడు.

"ఈసారి చేయి కాల్చుకోమన్నాడు" మిత్రుడు.

"ఇప్పుడు చేయి కాల్చుకుంటున్నాను కదా!" అన్నాడు ఉమేష్.


"ఓరి వెర్రినాయనా! చేయి కాల్చుకోవడమంటే నిజంగా కాల్చుకోమని అర్థం. వంట చెయ్యడం కాదు" అన్నాడు మిత్రుడు.

నిజంగానే చేయి కాల్చుకున్నాడు ఉమేష్. డాక్టర్ దగ్గరకి తీసుకెళితే, డాక్టర్ వంటచెయ్యడం యిష్టంలేక ఈ వెధవ్వేషాలేస్తున్నాడని తెలుసుకుని "వంట చెయ్యని మగాళ్ళంటే నాకు చాలా అసహ్యం! అసలు నలుడు, భీముడు బాధపడతారని కూడా ఆలోచించరు వీళ్ళు. ఆపరేషన్స్ చేసి చేసి, నా కుడి చెయ్యి నొప్పిగా వున్నా యింట్లో వంట ఎడం చేత్తో చేసి పారేస్తాను. ఇతను ఏ కారణం చేతనైనా అతితెలివిగా ఎడం చెయ్యి కూడా కాల్చుకుంటే వెంటనే నా దగ్గరికి మళ్ళీ తీసుకురండి. ఇటువంటివాళ్ళ రోగం ఎలా కుదర్చాలో నాకు బాగా తెలుసు. అప్పుడు చెపుతాను యితని పని" అన్నాడు డాక్టర్.

"డాక్టర్ నిన్ను దేవుడు కూడా క్షమించడు!" అని గట్టిగా అరుద్దామనుకున్నాడు ఉమేష్.

జరిగిన విషయాలన్నీ తన పిన్నికి తెలియపరచి ఆవిడ్ని రప్పించింది రమ. ఆవిడ మళ్ళీ గాడిలో పెట్టింది ఉమేష్‌ని.

ఓ పదిరోజులుండి పిన్ని మళ్ళీ ఢిల్లీ వెళ్ళిపోయింది.




వెళ్ళేటప్పుడు "యీసారేదైనా సమస్య వస్తే 'వైద్యో నారాయణో హరిః' అని ఆ డాక్టర్ దగ్గరికి తీసుకుపో! అంత పెద్ద వైద్య విద్య నేర్చుకున్న డాక్టర్లే లక్షణంగా యింట్లో వంట చేస్తూంటే, ఈ ఉమేష్‌కి ఏం తెగులో నాకర్థం కావటం లేదు. అవసరమైతే నే మళ్ళీ వస్తా! ఏం కంగారుపడకు! నలభై ఏళ్ళు ఏకతాకీని వంట చేసి అలిసిపోయిన నీకు దేవుడు తప్పక సహాయం చేస్తాడు" అంది.

అన్నీ విన్న ఉమేష్ యింక వంటనుంచి తప్పించుకోలేం! ఓ వైపు రమ, రమ పిన్నీ, మరోవైపు రోగాలు కుదిర్చే ఆ వైద్యశాస్త్ర నిపుణుడు అనుకుంటూ శ్రద్ధగా వంట చెయ్యడం మొదలెట్టేశాడు.

పోను పోను పాకశాస్త్ర నిపుణుడయ్యాడు. చుట్టూ వున్న ఆడవాళ్ళు కూడా వంట విషయంలో ఉమేష్ సలహాలు తీసుకునేవారు. వంట చేసేటప్పుడు మాత్రం ఆనక తీరికవేళ రమ్మనేవాడు.

"ఉప్పు ఎక్కువయితే కంగారు పడకండి. ఏ పులుసులోనైనా ఉప్పు ఎక్కువయితే అందులో చిన్న బొగ్గుముక్క పడేయండి. కర్బనం ఉప్పులోని శక్తిని పీల్చేస్తుంది" అంటూ రకరకాల చిట్కాలు అవి కూడా చెపుతున్నాడు. ★